06-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇప్పుడు మీది వానప్రస్థావస్థ ఎందుకంటే మీరు వాణి నుండి అతీతముగా, ఇంటికి వెళ్ళాలి అందుకే స్మృతిలో ఉంటూ పావనముగా అవ్వండి"

ప్రశ్న:- ఉన్నతమైన గమ్యానికి చేరుకునేందుకు ఏ విషయము గురించి తప్పకుండా జాగ్రత్త వహించాలి?

జవాబు:- కళ్ళను సంభాళించుకోండి, ఇవే చాలా మోసం చేస్తూ ఉంటాయి. అశుద్ధమైన దృష్టి ఎంతో నష్టపరుస్తుంది అందుకే ఎంత వీలైతే అంత స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి. పరస్పరం సోదర దృష్టిని అభ్యాసము చేయండి. ఉదయముదయమే లేచి ఏకాంతములో కూర్చొని మీతో మీరు మాట్లాడుకోండి. భగవంతుని ఆజ్ఞ ఏమిటంటే - మధురమైన పిల్లలూ, కామము మహాశత్రువు నుండి జాగ్రత్తగా ఉండండి.

ఓం శాంతి. మధురాతి మధురమైన ఆత్మిక పిల్లలు అర్థం చేసుకున్నారు - ఇక్కడ మనుష్యులెవ్వరూ చదివించరు, ఇక్కడ భగవంతుడు చదివిస్తారు అని, ఎందుకంటే ఇది అర్థం చేసుకునేవారే ఇక్కడికి రాగలుగుతారు. భగవంతుని పరిచయం కూడా కావాలి. భగవంతుడు అన్న పేరు ఎంత గొప్పది, మళ్ళీ నామరూపాలకు అతీతమైనవారు అని కూడా అంటారు. వారు ప్రత్యక్షముగా ఉంటూ కూడా అతీతముగా ఉన్నట్లే. ఇంత చిన్నని బిందువు, ఆత్మ నక్షత్రము అని కూడా అంటారు. వాస్తవానికి ఆ నక్షత్రాలు చిన్నవేమీ కావు. ఈ ఆత్మా రూపీ నక్షత్రమైతే నిజంగా చిన్ననిది. తండ్రి కూడా బిందువే. తండ్రి సదా పవిత్రమైనవారు. జ్ఞానసాగరుడు, శాంతిసాగరుడు... అని వారి మహిమ కూడా ఉంది. ఇందులో తికమకపడే విషయమేదీ లేదు. ముఖ్యమైన విషయము పావనంగా అవ్వడము. వికారాల గురించే గొడవ జరుగుతుంది. పావనంగా అయ్యేందుకు పతిత-పావనుడిని పిలుస్తారు. మరి తప్పకుండా పావనంగా అవ్వాల్సి ఉంటుంది కదా, ఇందులో తికమకపడకూడదు. ఏదైతే గతించిందో, విఘ్నాలు మొదలైనవి కలిగాయో, అవేమీ కొత్త విషయాలు కావు. అబలలపై అత్యాచారాలు జరగనున్నాయి. ఇతర సత్సంగాలలో ఈ విషయాలు ఉండవు. ఎక్కడా గొడవలు జరగవు. ఇక్కడ విశేషముగా ఈ విషయానికి సంబంధించే గొడవలు జరుగుతాయి. తండ్రి పావనంగా తయారుచేయడానికి వస్తారు, అప్పుడు ఎన్ని గొడవలు జరుగుతాయి. తండ్రి కూర్చొని చదివిస్తారు. నేను వానప్రస్థావస్థలోనే వస్తాను అని తండ్రి అంటారు. వానప్రస్థావస్థ యొక్క నియమము కూడా ఇక్కడి నుండే ప్రారంభమవుతుంది. మరి వానప్రస్థావస్థ వారు తప్పకుండా వానప్రస్థములోనే ఉంటారు. వాణి నుండి అతీతముగా వెళ్ళేందుకు తండ్రిని పూర్తిగా స్మృతి చేసి పవిత్రంగా అవ్వాలి. పవిత్రముగా అయ్యేందుకు మార్గమైతే ఒక్కటే. తిరిగి వెళ్ళాలంటే తప్పకుండా పవిత్రముగా అవ్వాలి. అందరూ అయితే వెళ్ళాల్సిందే. ఇద్దరు-నలుగురు మాత్రమే వెళ్ళడము కాదు. మొత్తం పతిత ప్రపంచమంతా పరివర్తన అవ్వాలి. ఈ డ్రామా గురించి ఎవ్వరికీ తెలియదు. సత్యయుగము నుండి కలియుగము వరకూ ఈ డ్రామా చక్రము ఉంది. తండ్రి అంటారు - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయాలి మరియు పావనంగా కూడా తప్పకుండా అవ్వాలి, అప్పుడే మీరు శాంతిధామము మరియు సుఖధామంలోకి వెళ్ళగలుగుతారు. గతి-సద్గతిదాత ఒక్కరే అన్న గాయనము కూడా ఉంది. సత్యయుగములో చాలా కొద్దిమంది ఉంటారు మరియు పవిత్రముగా ఉంటారు. కలియుగములో అనేక ధర్మాలు ఉన్నాయి మరియు అపవిత్రముగా అయిపోతారు. ఇది సహజమైన విషయము మరియు దీనిని తండ్రి ముందు నుండే తెలియజేస్తారు. గొడవలు తప్పకుండా జరుగుతాయని తండ్రికైతే తెలుసు. ఒకవేళ వారికి తెలియకపోతే, మేము జ్ఞానామృతాన్ని తాగడానికి వెళ్ళాలి, లెటర్ తీసుకురండి అని యుక్తులను ఎందుకు రచిస్తారు. ఈ గొడవలు జరగడం కూడా డ్రామాలో నిశ్చయించబడి ఉంది అని వారికి తెలుసు. ఆశ్చర్యం కలిగేలా మంచి రీతిలో గుర్తించి జ్ఞానాన్ని తీసుకుంటారు, ఇతరులకు కూడా జ్ఞానాన్ని ఇస్తారు, అయినా కానీ - అహో మాయ, వారిని నీవు నీ వైపుకు లాగేసుకుంటావు. ఇదంతా డ్రామాలో నిశ్చయించబడి ఉంది. ఈ విధిని ఎవ్వరూ తప్పించలేరు. మనుష్యులు కేవలం ఆ పదాన్ని ఉపయోగిస్తారు కానీ దాని అర్థము తెలియదు. పిల్లలూ, ఇది చాలా ఉన్నతమైన చదువు. కళ్ళు ఎంత మోసం చేస్తూ ఉంటాయంటే, ఇక అడగకండి. ఇది తమోప్రధాన ప్రపంచము, కాలేజీలలో కూడా ఎంతగానో పాడైపోతూ ఉంటారు. విదేశాల గురించైతే ఇక అడగకండి. సత్యయుగములో ఇటువంటి విషయాలు ఉండవు. వారేమో సత్యయుగానికి లక్షల సంవత్సరాలు అని అంటారు. తండ్రి అంటారు - నేను మీకు నిన్న రాజ్యభాగ్యాన్ని ఇచ్చి వెళ్ళాను, అంతా పోగొట్టుకున్నారు. లౌకికములో కూడా తండ్రి - నేను మీకు ఇంత ఆస్తిని ఇచ్చాను, అంతా పోగొట్టుకున్నారు అని అంటారు. ఎటువంటి పిల్లలు వెలువడుతారంటే వారు ఒక్క దెబ్బతో ఆస్తినంతటినీ ఎగురగొట్టేస్తారు. అనంతమైన తండ్రి కూడా అంటారు - నేను మీకు

ఎంత ధనాన్ని ఇచ్చి వెళ్ళాను, మిమ్మల్ని ఎంతటి యోగ్యులుగా, విశ్వాధిపతులుగా చేసి వెళ్ళాను, ఇప్పుడు డ్రామానుసారంగా మీకు ఎటువంటి పరిస్థితి ఏర్పడింది! మీరు ఆనాటి నా పిల్లలే కదా. మీరు ఎంత ధనవంతులుగా ఉండేవారు. ఇది అనంతమైన విషయము, దీనిని మీరు అర్థం చేయిస్తారు. ఒక కథ ఉంది - రోజూ పులి వచ్చింది, పులి వచ్చింది అని అనేవాడు. కానీ పులి వచ్చేది కాదు. ఒకానొకరోజు నిజంగానే పులి వచ్చేసింది. మీరు కూడా - మృత్యువు వచ్చేసింది, వచ్చేసింది అని అంటారు, అప్పుడు వారంటారు - వీళ్ళు రోజూ ఇలా అంటారు కానీ వినాశనమైతే జరుగడం లేదు. ఒకరోజు తప్పకుండా వినాశనం జరుగుతుందని ఇప్పుడు మీకు తెలుసు. దానినే వారు కథగా తయారుచేసారు. అనంతమైన తండ్రి అంటారు - వారి దోషమేమీ లేదు. ఇది కల్పపూర్వం కూడా జరిగింది. ఇది 5,000 సంవత్సరాల విషయము. బాబా అయితే ఎన్నో సార్లు చెప్పారు - 5,000 సంవత్సరాల క్రితం కూడా భారత్ లో దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేసేందుకు అచ్చంగా ఇలాంటి మ్యూజియం తెరవబడింది అని మీరు వ్రాస్తూ ఉండండి. పూర్తిగా స్పష్టంగా వ్రాసినట్లయితే వారు వచ్చి అర్థం చేసుకుంటారు. బాబా వచ్చి ఉన్నారు. స్వర్గ రాజ్యాధికారమే తండ్రి వారసత్వము. భారత్ స్వర్గంగా ఉండేది. మొట్టమొదట కొత్త ప్రపంచములో కొత్త భారత్ స్వర్గముగా ఉండేది. స్వర్గమే మళ్ళీ నరకంగా అవుతుంది. ఇది చాలా పెద్ద అనంతమైన నాటకము, ఇందులో అందరూ పాత్రధారులే. 84 జన్మల పాత్రను అభినయించి ఇప్పుడు మళ్ళీ మనం తిరిగి వెళ్తాము. మొదట మనం యజమానులుగా ఉండేవారము, మళ్ళీ నిరుపేదలుగా అయిపోయాము. ఇప్పుడు మళ్ళీ బాబా మతంపై నడుచుకుని యజమానులుగా అవుతాము. మీకు తెలుసు - మనం శ్రీమతం అనుసారంగా కల్ప-కల్పము భారత్ ను స్వర్గముగా తయారుచేస్తాము. పావనంగా కూడా తప్పకుండా అవ్వాలి. పావనముగా అవుతున్న కారణంగా అత్యాచారాలు జరుగుతాయి. బాబా, పిల్లలకు ఎంతో అర్థం చేయిస్తారు, మళ్ళీ బయటకు వెళ్ళగానే వివేకహీనులుగా అయిపోతారు. ఆశ్చర్యం కలిగేలా వింటారు, వినిపిస్తారు, జ్ఞానాన్ని ఇస్తారు, అహో మమం మాయ, ఎలా ఉన్నవారు అలానే అయిపోతారు, అంతకంటే హీనంగా అయిపోతారు. కామ వికారములో చిక్కుకున్నారంటే ఇక పడిపోయినట్లే.

శివబాబా ఈ భారత్ ను శివాలయంగా తయారుచేస్తారు, కావున పిల్లలు కూడా పురుషార్థం చేయాలి. ఈ అనంతమైన బాబా చాలా మధురమైన బాబా. ఒకవేళ అందరికీ తెలిసిపోయిందంటే లెక్కలేనంతమంది వచ్చేస్తారు. ఇక చదువు కొనసాగదు. చదువులోనైతే ఏకాంతం కావాలి. తెల్లవారుజామున ఎంత శాంతి ఉంటుంది. మనం స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేస్తాము. స్మృతి లేకుండా వికర్మలు ఎలా వినాశనమవుతాయి? ఈ చింతయే పట్టుకుని ఉంది. ఇప్పుడు పతితులుగా, నిరుపేదలుగా అయిపోయారు, మళ్ళీ పావనులుగా, కిరీటధారులుగా ఎలా అవ్వాలి. తండ్రి అయితే చాలా సహజమైన విషయాన్ని అర్థం చేయిస్తారు. గొడవలైతే జరుగుతాయి. భయపడాల్సిన విషయమేదీ లేదు. తండ్రి పూర్తిగా సాధారణమైనవారు. వారి వస్త్రధారణ మొదలైనవన్నీ అవే. ఏమీ మార్పు లేదు. సన్యాసులైతే ఇళ్ళు-వాకిళ్ళను వదిలి కాషాయ వస్త్రాలను ధరిస్తారు, కానీ వీరి వస్త్రధారణ అయితే అదే. కేవలం తండ్రి ప్రవేశించారు, ఇంకే మార్పూ లేదు. ఏ విధముగా తండ్రి పిల్లలను ప్రేమగా సంభాళిస్తారు, లాలన-పాలన చేస్తారు, అలాగే వీరు కూడా చేస్తారు. ఇందులో అహంకారం విషయమేమీ లేదు. పూర్తి సాధారణంగా నడుచుకుంటారు. కానీ ఉండేందుకు ఇళ్ళను నిర్మించవలసి ఉంటుంది. అవి కూడా సాధారణమైనవే. మిమ్మల్ని అనంతమైన తండ్రి చదివిస్తారు. తండ్రి అయస్కాంతం వంటివారు. వారేమైనా తక్కువా! పిల్లలు పవిత్రముగా అయినట్లయితే వారికి ఎంతో సుఖము లభిస్తుంది. ఇతరులైతే - ఏదో శక్తి ఉంది అని అంటారు కానీ శక్తి అని దేనినంటారో కూడా వారు అర్థం చేసుకోరు. సర్వ శక్తివంతుడు తండ్రి, వారు అందరినీ ఈ విధంగా తయారుచేస్తారు. కానీ అందరూ ఒకే విధంగా తయారవ్వలేరు. అలాగైతే రూపురేఖలు కూడా ఒకేలా ఉండాలి, పదవి కూడా ఒకేలా ఉండాలి. ఈ డ్రామా తయారై ఉంది. 84 జన్మలలో మీకు కల్పక్రితం ఏవైతే 84 రూపురేఖలు లభించాయో, అవే లభిస్తాయి. ఆ రూపురేఖలే లభిస్తూ ఉంటాయి. ఇందులో మార్పు ఉండదు. ఇవి ఎంతగా అర్థం చేసుకోవాల్సిన మరియు ధారణ చేయవలసిన విషయాలు. వినాశనమైతే తప్పకుండా జరగనున్నది. విశ్వంలో ఇప్పుడు శాంతి ఏర్పడదు. పరస్పరం కొట్లాడుకుంటూ ఉంటారు. మృత్యువు తలపై నిలబడి ఉంది. డ్రామానుసారంగా ఒక్క ఆది సనాతన దేవీ-దేవతా ధర్మ స్థాపన, మిగిలిన ధర్మాల వినాశనం జరగాలి. అటామిక్ బాంబులను కూడా తయారుచేస్తూ ఉంటారు. ప్రకృతి వైపరీత్యాలు కూడా జరుగుతాయి. పెద్ద-పెద్ద రాళ్ళు పడతాయి, దానితో ఇళ్ళు మొదలైనవన్నీ కూలిపోతాయి. ఎంత దృఢమైన ఇళ్ళను నిర్మించినా, పునాదులను పక్కాగా నిర్మించినా కానీ మిగిలేది ఏమీ లేదు. భూకంపాల సమయంలో కూడా కూలిపోకుండా ఉండాలి అని వారు భావిస్తారు. కానీ ఎంత చేసినా కానీ, 100 అంతస్థులు నిర్మించినా కానీ వినాశనం తప్పకుండా జరగాల్సిందే. ఇవేవీ మిగలవు.

స్వర్గ వారసత్వాన్ని పొందేందుకు పిల్లలైన మీరు ఇక్కడకు వచ్చారు. విదేశాలలో ఏముందో చూడండి. దీనిని రావణుడి

ఆర్భాటము అంటారు. నేను కూడా తక్కువేమీ కాదు అని మాయ అంటుంది. అక్కడ మీ వజ్ర-వైఢూర్యాల మహళ్ళు ఉంటాయి. అన్ని వస్తువులు బంగారంతో తయారుచేయబడి ఉంటాయి. అక్కడ 2-3 అంతస్థులను నిర్మించవలసిన అవసరం లేదు. భూమి కోసం కూడా ఖర్చేమీ ఉండదు. అన్నీ ఉపస్థితమై ఉంటాయి. కావున పిల్లలు ఎంతగానో పురుషార్థం చేయాలి. అందరికీ సందేశమును ఇవ్వాలి. పిల్లలు మంచి-మంచి మార్గదర్శకులుగా అయి రిఫ్రెష్ అయ్యేందుకు వస్తారు. ఇది కూడా డ్రామాలో నిశ్చయించబడి ఉంది. ఇలా మళ్ళీ వస్తారు. ఇంతమంది వచ్చారు, వీరందరినీ మళ్ళీ చూస్తానా లేదా? వీరందరూ నిలిచి ఉంటారా లేదా? రావడమైతే లెక్కలేనంతమంది వచ్చారు, మళ్ళీ ఆశ్చర్యం కలిగేలా పారిపోయారు. బాబా, మేము పడిపోయాము అని వ్రాస్తారు. అరే, సంపాదించుకున్నదంతా పోగొట్టుకున్నారు! మళ్ళీ అంత పైకి ఎక్కలేరు. ఇది అన్నింటికన్నా పెద్ద ఆజ్ఞ ఉల్లంఘన. బయటివారు - ఫలానా సమయంలో ఎవ్వరూ బయటకు రాకూడదు, లేకపోతే షూట్ చేస్తాము అని చట్టం జారీ చేస్తారు. తండ్రి కూడా అంటారు - వికారాలలోకి వెళ్తే షూట్ చేయబడతారు. ఇది భగవంతుని ఆజ్ఞ కదా - జాగ్రత్తగా ఉండండి. ఈరోజుల్లో గ్యాస్ మొదలైనవాటికి సంబంధించి ఎటువంటి వస్తువులను తయారుచేసారంటే, మనుష్యులు కూర్చుని-కూర్చుని వెంటనే అంతమైపోతారు. ఇవన్నీ డ్రామాలో నిశ్చయించబడి ఉన్నాయి ఎందుకంటే చివర్లో హాస్పిటల్స్ మొదలైనవి ఉండవు. ఆత్మ వెంటనే ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకుంటుంది. దుఃఖాలు, కలహాలు మొదలైనవన్నీ దూరమైపోతాయి. అక్కడ కలహాలు మొదలైనవి ఉండనే ఉండవు. ఆత్మ స్వతంత్రంగా ఉంటుంది. ఏ సమయానికి ఆయుష్షు పూర్తవుతుందో, అప్పుడు శరీరాన్ని విడిచిపెడుతుంది. అక్కడ మృత్యువు ఉండదు. రావణుడే లేకపోతే మరి మృత్యువు ఎక్కడి నుండి వస్తుంది. అది రావణుడి దూత అంతేకానీ భగవంతుని దూత కాదు. భగవంతుని పిల్లలు చాలా ప్రియమైనవారు. తండ్రి ఎప్పుడూ పిల్లల దుఃఖాన్ని సహించలేరు. డ్రామానుసారంగా కల్పంలో మూడొంతులు మీరు సుఖాన్ని పొందుతారు. తండ్రి ఎంతటి సుఖాన్ని ఇస్తారు కావున వారి శ్రీమతముపై నడవాలి. ఇది అంతిమ జన్మ, గృహస్థ వ్యవహారములో ఉంటూ అంతిమ జన్మలో పవిత్రముగా అవ్వాలి అని తండ్రి అంటారు. తండ్రి స్మృతితోనే వికర్మలు వినాశనమవుతాయి. జన్మజన్మాంతరాల పాపాలు శిరస్సుపై ఉన్నాయి. తమోప్రధానము నుండి సతోప్రధానముగా తప్పకుండా అవ్వాలి. తండ్రి సర్వశక్తివంతుడైన అథారిటీ. శాస్త్రాలు మొదలైనవి ఎవరైతే చదువుతారో, వారిని అథారిటీ అని అంటారు. ఇప్పుడు తండ్రి అంటారు - నేను అందరికీ అథారిటీ. నేను ఈ బ్రహ్మ ద్వారా అన్ని శాస్త్రాల సారమును వచ్చి వినిపిస్తాను. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ నన్ను స్మృతి చేసినట్లయితే పాపాలు వినాశనమవుతాయి. అంతేకానీ నీటిలో స్నానము చేయడం వలన పావనంగా ఎలా అవుతారు! ఎక్కడైనా కాస్త నీరు ఉంటే దానిని కూడా తీర్థముగా భావించి వెంటనే స్నానము చేస్తారు. దీనిని తమోప్రధానమైన నిశ్చయము అని అంటారు. ఇది మీ సతోప్రధానమైన నిశ్చయము. ఇందులో భయపడవలసిన విషయమేమీ లేదు అని తండ్రి అర్థం చేయిస్తారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. భగవంతుడు పవిత్రముగా అవ్వాలని ఏ ఆజ్ఞనైతే ఇచ్చారో, ఆ ఆజ్ఞను ఎప్పుడూ తప్పకూడదు. చాలా-చాలా జాగ్రత్తగా ఉండాలి. బాప్ దాదాల ఇరువురి పాలనకు ప్రతిఫలంగా పవిత్రముగా అయి చూపించాలి.

2. డ్రామా విధి తప్పించలేనిదిగా తయారుచేయబడి ఉంది, దానిని తెలుసుకొని సదా నిశ్చింతగా ఉండాలి. వినాశనానికి ముందే అందరికీ తండ్రి సందేశాన్ని చేర్చాలి.

వరదానము:- జ్ఞాన అమృతము ద్వారా దాహంతో ఉన్న ఆత్మల దాహాన్ని తీర్చి తృప్తిపరిచే మహాన్ పుణ్యాత్మా భవ

దాహంతో ఉన్న వారి దాహాన్ని తీర్చడము - చాలా గొప్ప పుణ్యము. ఏ విధంగా నీరు లభించకపోతే దాహంతో అలమటిస్తారో, అదే విధంగా జ్ఞాన అమృతము లభించకపోవటం వలన ఆత్మలు దుఃఖము, అశాంతితో అలమటిస్తూ ఉన్నారు, కావున వారికి జ్ఞానామృతమును ఇచ్చి దాహాన్ని తీర్చేవారిగా అవ్వండి. ఏ విధంగా భోజనం స్వీకరించడానికి తీరిక చేసుకుంటారు ఎందుకంటే అది అవసరము, అదే విధంగా ఈ పుణ్య కార్యాన్ని చెయ్యటము కూడా అవసరమే. అందుకే ఈ అవకాశాన్ని తీసుకోవాలి, సమయం తీయాలి - అప్పుడే మహాన్ పుణ్యాత్ములు అని అంటారు.

స్లోగన్:- గతించినదానికి బిందువు పెట్టి ధైర్యముతో ముందుకు వెళ్ళినట్లయితే తండ్రి సహాయము లభిస్తూ ఉంటుంది.